# కంప్యూటర్ పెళ్ళి

'ఏమండీ! ఇప్పటికి పదిహేను రోజులనుంచి కూర్చున్నచోటికి కాఫీలూ, టీలూ పంపిస్తున్నాను. గంటలు గంటలు అలా దానిముందు కూర్చుంటున్నారు. ఒక్కటీ కుదరలేదా? అసలు మీరు అన్నీ చూస్తున్నారా లేక నా పోరుపడలేక అలా కూర్చుని చూస్తున్నట్టు నటిస్తున్నారా?' కాఫీ కప్పు తెచ్చి కంప్యూటర్ టేబుల్ పక్కన పెడుతూ దండకం ప్రారంభించింది పరమేశ్వరి.

'అబ్బా! కాస్సేపు నీ గోల ఆపు పరా! గుక్క తిప్పుకోకుండా అలా మాట్లాడుతూ వుంటే, ఇక్కడ నా బుర్రపనిచేయాలా?' విసుక్కున్నాడు సోమేశం.

'అదే... అదే అనవద్దన్నాను. ఏమిటా పిలుపు 'పరా' 'కురా' అంటూ. చిన్నప్పుడు అలా పిలిస్తే ఎప్పటికీ అలాగే పిలవాలా ఏం? అందుకే 'మేనత్త కొడుకూ ఒక మొగుడేనా?' అన్న సామెత పుట్టింది. అదే పై సంబంధం మనిషైతే పరమేశీ, ఈశీ అంటూ ముద్దుగా పిలుచుకునేవాడు. అసలు ఈ అమ్మమ్మలూ, బామ్మలూ వున్నారే, వాళ్ళననాలి. వరస కలిస్తే చాలు ఉయ్యాల్లో పిల్లని పట్టుకుని, నీకు పెళ్ళాం పుట్టిందిరా అని చెబుతూంటారు.

ఆ కుర్రాడు ఏదో రబ్బరు బొమ్మని చూసినట్టుగా దానికేసి చూసి బోసినవ్వు నవ్వుతాడు. ఉయ్యాల్లో పెళ్ళికూతురు. చంకలో పెళ్ళికొడుకూ...!

పెద్దయ్యాక వాళ్ళ ఇష్టాయిష్టాలు తెలుసుకొని మాట్లాడదాం అన్న మాటేలేదు. అంతా వాళ్ళిష్టమే. కనడం, పెంచడం, పెళ్ళి - అంతా! ఆ తరవాత మాత్రం వాళ్ళ అదృష్టం, వాళ్ళ ఖర్మ అని వదిలేస్తూ ఉంటారు.

పుట్టినప్పటినుంచీ చూస్తూ, కలిసి ఆడుతూ కలిసి పోట్లాడుతూ ఒక్కచోటే పెరిగినవాళ్ళకి రోజుకి పదిసార్లు వీళ్ళు కాబోయే మొగుడూ పెళ్ళాలంటూ వుంటే ఇక జీవితంలో కొత్తదనం ఏముంటుంది? పెళ్ళినాడు కూడా ఆ మాటలు అరిగిపోయిన గ్రామఫోన్ రికార్డులాగే వుంటాయి. ఒక్క ఆ రోజు, కొన్ని ఘడియలు తప్ప, 'ఓల్డ్‌వైన్ ఇన్ న్యూ బాటిల్' అంటారే (పాత వైనే కొత్త సీసాలో) అలాగ. కట్టీ కట్టీ విడిచేసిన మాసిపోని గుడ్డలాగా. వినీ వినీ విసిగిపోయిన పాత మాటలే!' కాఫీ కప్పుతో మంచంమీద కూర్చుంటూ నిష్ఠూరంగా అంది పరమేశ్వరి.

'ఓయ్... ఓయ్... అయిందా నీ దండకం. పిచ్చిదానా? నీకింకా బుద్ధిరాలేదే... ఇంకా చిన్నపిల్లవే.. పరా అన్నా, పరమేశీ అన్నా, ఈశీ అన్నా పిలుపులో ఏముందే.? పిలిచే

గొంతులోని ఆర్ద్రత, అభిమానం, ప్రేమ అనేవి తామరతూడులో కనిపించని దారప్పోగులా వున్న నారలా వుంటుందే, అదే అసలైన ప్రేమ. అది కనిపించదు కానీ హృదయాన్ని తాకుతుంది. 'డార్లింగ్, స్వీటీ' అంటూ పిలవగానే సరా... లోపల ఆర్ద్రత, అభిమానం లేని ఆ పిలుపు పెదవిపై పూసిన తీపివంటకంలా నాలికతో స్పృశిస్తే క్షణం తీపి తగులుతుందే తప్ప, నోట్లో నుంచి కడుపులోకి జారిన వంటకం రుచిలా, తనివి తీరుతుందా?

'చాల్లెండి, నోరు విప్పితే చాలు ఉపమానాలూ, ఉపోద్ఘాతాలూ లెక్కలేనన్ని చెప్తారు. ఇది మనిషి అలవాటైపోయింది' కాఫీ సిప్‌చేస్తూ అంది పరమేశ్వరి.

'కరెక్టుగా చెప్పావు పరా...! నేనంటూ వుంటాను నువ్వు వింటూ వుంటావు.నువ్వంటూ వుంటావు. నేను వింటూ ఉన్నాను. అందుకే మనం హాయిగా నలభైయేళ్ళ నుంచి సంసారం చేస్తున్నాం. లేకపోతే ఏముంది? నువ్వటూ, నేనిటూ... విడాకులూ, విడిపోవడాలూ... అంతే!

మూతి బిగించి ఇటూ అటూ వెక్కిరిస్తూన్నట్టుగా తిప్పి, 'మీరెన్నయినా చెప్పండి. నా కూతురికి మాత్రం విదేశీ సంబంధం మాత్రమే చేస్తాను. నా చిట్టితల్లి ముద్దూ ముచ్చటలన్నీ తీరాలి. అది డాలర్లతో తేలిపోవాలి.'

'హూఁ... లక్షాధికారైన లవణమన్నమె కాని, మేలిమి బంగారు మింగబోడు... వూ... వూ... వూ... ఆ... ఆ... ఆ...' అంటూ పద్యాన్ని రాగయుక్తంగా పాడుతూ ఆటపట్టిస్తున్న సోమేశాన్ని కొరకొరా చూస్తూ అక్కడినుంచి గభాలున లేచి వెళ్ళిపోయింది పరమేశ్వరి.

'అలిగితివా, సఖీప్రియా అలకమానవా?' అంటూ ఆమె వెనకాలే వంటింట్లో కెళ్ళాడు సోమేశం. కళ్ళు పెద్దవి చేసి 'ఏమిటి పిచ్చి చేష్టలు' ఉరిమింది పరమేశ్వరి.

'అమ్మో! సిగ గాబట్టి సరిపోయింది. అదే అప్పటిలాగ జడా జడగంటలూ వుంటే చేతిమీద ఈపాటికి వాతలు పడేవి' అంటూ వెనకనుంచి ఆమెని గట్టిగా పట్టుకొని 'చూడు ఈ కాగితం' అంటూ చూపించాడు సోమేశం. విసుక్కుంటూనే చూసింది పరమేశ్వరి.

'ఇంద్రనీల్!... వయస్సు ఇరవై ఎనిమిది సంవత్సరాలు! నెలకి ఇరవై అయిదువేల డాలర్లు సంపాదన. ఉద్యోగం... సాఫ్ట్‌వేర్ ఇంజనీర్... కులం ఏదైనా ఫరవాలేదు. ఇండియన్ అయితే చాలు. చదువు డిగ్రీ వుంటే చాలు. ఆస్తిపాస్తులతో సంబంధంలేదు. వెంటనే పెళ్ళి జరిపించెయ్యాలి. మళ్ళీ వారం ఇండియాకొస్తున్నాను. ఢిల్లీలో వసంత్ కుంజ్‌లో గెస్ట్‌హౌస్‌లో వుంటాను. ఫోన్ నంబరు వివరాలు ఇస్తున్న చోటికి ఫోన్‌చేసి సంప్రదించవచ్చు...'

పరమేశ్వరి కళ్ళు చెదిరిపోయాయి. వైకుంఠంలో విష్ణుమూర్తిలా అనిపించాడు ఇంద్రనీల్... తన కూతురు సరిత సాక్షాత్తు లక్ష్మీదేవిలా అనిపించిందామెకి.

'ఏమండీ!' ఎగిరి గంతేసింది పరమేశ్వరి. ఒకటి... రెండు... మూడు... పదిసార్లు చదివింది. ఉక్కిరిబిక్కిరయిపోయింది. 'ఏమండీ! వారం రోజులవుతోంది. అతను ఢిల్లీకొచ్చేసుంటాడు. ఆ నెంబరుకి ఫోన్‌చేసి మన వివరాలన్నీ చెప్పండి. లేకపోతే ఇంకెవరైనా కొట్టేస్తారు ఈ మంచి అవకాశాన్ని' తొందర చేసిందామె.

'అలాగే... పరా! ముందు అతనిచ్చిన అడ్రస్‌కి అప్పుడే ఈ మెయిల్ చేసేశాను. ఇదుగో ఇప్పుడే ఫోన్‌చేస్తాను' అంటూ ఫోన్ దగ్గరికెళ్ళాడు సోమేశం. పరమేశ్వరి మురిసిపోతోంది. తన స్నేహితురాలు విజయ కూతురు టెక్సాస్‌లో వుంది. శమంతకమణి కూతురు లండన్‌లో వుంది. లలిత కూతురు ఆఫ్రికా... అబ్బా... తన కూతురుకూడా అమెరికాలో... అప్పుడే పెళ్ళైపోయినట్టూ సరిత కడుపుతో వున్నట్టు, తనూ సోమేశం పురిటికి అమెరికా వెళ్ళినట్టు కలలు కనేస్తోంది పరమేశ్వరి. ఇదంతా వింటున్న సరిత మనసులో కొత్త ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయ్.

ఫోన్‌లో ఇంద్రనీల్ దొరికాడు. గంటసేపు మాట్లాడాడు సోమేశం, వివరాలన్నీనూ! తరవాత ఇంద్రనీల్ ఫోన్ చేశాడు. పరమేశ్వరి మాట్లాడింది. ఈసారి సరితని మాట్లాడించింది. మళ్ళీ తను మాట్లాడింది. ఈ వారంలోగా కొన్ని వందలసార్లు ఈ ఫోనూ ఆ ఫోనూ మోగింది. అన్నీ ఫోన్‌లోనే పూర్తయ్యాయి. కేవలం ఒకసారి చూడాలన్న కుతూహలంతో సోమేశం, పరమేశ్వరి, సరితని తీసుకొని ఢిల్లీవెళ్ళివచ్చారు. పరమేశ్వరికి రెక్కలొచ్చినంత సంతోషం. స్నేహితులందరికీ ఫోన్‌చేసి చెప్పేసింది.

సరిత అదృష్టానికి మురిసిపోయారందరూ. పెళ్ళి ఒక వారంరోజుల్లో చేద్దామనుకున్నారు. కానీ, పెళ్ళికొడుక్కి హఠాత్తుగా ఫోన్‌వచ్చింది. టెక్సాస్‌నుంచి కెనడాకి మారిపోయే అవకాశం. ఎప్పుడో కెనడాకి వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్న ఇంద్రనీల్ ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీకి అప్లయ్‌చేస్తే ఆ ఉద్యోగం ఇప్పుడొచ్చింది. అందుకని అతడు మార్చిలో ముహూర్తాలు పెట్టుకుందామన్నాడు. మధ్యలో ఒక నెలేకదా సరేనన్నారు సోమేశంగారు.

పరమేశ్వరి ఆనందానికి అంతులేదు. అదృష్టం అంటే సరితదే! ఇంద్రనీల్‌కి తల్లీతండ్రీ చిన్నప్పుడే పోయారట. అక్కచెల్లెళ్ళు లేరు. వేరే అన్నదమ్ములు లేరు. మేనమామగారింట్లో పెరిగి పెద్దయి, విదేశాలకి చదువులకోసం వెళ్ళి అక్కడే స్థిరపడిపోయాడట. ఇప్పుడు మేనమామకూడా లేడట. మేనత్తతో అంత పెద్దగా సత్‌సంబంధాలు లేవట. ఇవన్నీ విన్నాక పరమేశ్వరికి సరిత అంత అదృష్టవంతురాలు మరొకరు లేరనిపించింది.

ఢిల్లీలోనే ఒక మంచి రోజు చూసి హోటల్ అశోకాలో తాంబూలాలు పుచ్చుకున్నారు సోమేశం దంపతులు. ఈ సందర్భంగా ఇంద్రనీల్ సరితకి ఇరవైతులాల బంగారం, పదివేల

రూపాయల పట్టుచీర కొన్నాడు. పరమేశ్వరి పదివేల రవ్వల ఉంగరం తొడిగింది ఇంద్రనీల్‌కి. చక్కటి సూటూ బూటూ కొన్నాడు సోమేశం. ఆరోజు అంతా ఇంచుమించు చిన్న పెళ్ళిలాగే అనిపించింది.

హైదరాబాద్ తిరిగొచ్చిన సోమేశంగారికీ పరమేశ్వరికీ చేతినిండా పనులే. సరిత ఒక్కగానొక్క కూతురు వారికి. కొడుకు ప్రణవ్ ఇంకా చదువుతున్నాడు ఐ.ఐ.టి. ఖరగ్‌పూర్‌లో. రోజూ షాపింగులే. ఒకరోజు నగలూ, ఒకరోజు బట్టలు. ప్రతీ నిమిషం స్నేహితులతో, బంధువులతో పెళ్ళిమాటలే. రోజొక క్షణంలా జరిగిపోతోంది.

ఆరోజు సోమేశం స్నేహితుడు పాపారావ్ వచ్చాడు ముంబయినుంచి. ముంబయిలో పాపారావు పెద్ద ఇండ్రస్టియలిస్టు. బిజినెస్ పనిమీద ప్రపంచం అంతటా తిరుగుతూ వుంటాడు. ఆ రోజు స్నేహితులిద్దరూ కబుర్లతోనే కడుపు నింపుకున్నారు. దానికితోడు పరమేశ్వరి చేసిన పిండివంటలు జోడింపబడి భుక్తాయాసంతో మరిన్ని కబుర్లు అందులోనూ అన్నీ పెళ్ళి కబుర్లే చెప్పుకున్నారు.

పాపారావు తను కెనడా కూడా వెళుతున్నానన్నాడు. వెంటనే తన కాబోయే అల్లుణ్ణి కలుసుకోమని ఇంద్రనీల్ అడ్రసిచ్చాడు. అల్లుడికోసం తయారుచేసిన లడ్డూలూ, మైసూర్‌పాకూ పంపించింది పరమేశ్వరి.

రెండు రోజుల తరువాత పాపారావు ఫోన్ చేశాడు కెనడానుంచి. సోమేశం, పరమేశ్వరి ఆత్రంగా పరుగెత్తారు ఫోన్ దగ్గరకి. అంతే! సోమేశం మొహంలో కళ తప్పింది. మాటలు తడబడ్డాయి. పరమేశ్వరి అతణ్ణి సోఫాలో కూర్చోబెట్టింది. తన చేతిలోని రిసీవర్ తీసికొని చెవిదగ్గర పెట్టుకుంది. పాపారావు చెబుతున్నాడు. 'ఒరేయ్! నువ్వు మోసపోయావురా, ఇంద్రనీల్‌కి ఒక అమెరికన్ అమ్మాయితో ఎప్పుడో పెళ్ళయిపోయింది. ఇద్దరు పిల్లలు. అమ్మాయి ఎలిజబెత్‌కి ఆరేళ్ళు, అబ్బాయి పీటర్‌కి నాలుగేళ్ళు. వాళ్ళ ఇళ్ళూ, సంసారం చూశాను.

నేను నీ స్నేహితుడిలా కాక ఒక బిజినెస్‌మేన్‌లా వెళ్ళి కలుసుకున్నాను. మాటల్లో నాకర్థమయిందేమిటంటే, ఇక్కడ చదువుకుంటున్న రోజుల్లోనే అతనికి ప్యేట్రీషియా అనే అమ్మాయితో స్నేహం ఏర్పడింది. అది పెళ్ళికి దారితీసింది. కొన్నేళ్ళు అందంగా జరిగిపోయింది జీవితం. రాను రాను అతనిలో అతని తెలుగుతనం బయటపడుతోంది. తనజాతి, తన అలవాట్లు, తన భోజనం గుర్తుకొస్తున్నాయి. అవి తీర్చుకోవడం కోసం, మరో సెటప్

పెడదామను కున్నట్టున్నాడు. ఇక్కడ పేట్రీషియాతో సంబంధం తెంచుకోలేకపోతున్నాడు. పిల్లలు ప్రతిబంధకాలు. ఇదిరా సంగతి.

పెళ్ళయినా సరితని ఇండియాలోనే వుంచేసేవాడో లేదా సవతి సంగతి ఇక్కడికొచ్చాక చెప్పేవాడో మరి! ఏదేమయినా మీరు అదృష్టవంతులు. పెళ్ళయిపోకుండానే విషయాలు తెలుసుకోగలిగారు' మరి వినలేకపోయింది పరమేశ్వరి. అమెరికా మోజు, పోటీతత్వం, పైపై మెరుగులూ అన్నీ మంచులా కరిగిపోయాయి. శుద్ధమైన ప్రేమ, అభిమానాలూ, బంధుత్వాలూ, మానవ సంబంధాలూ కళ్ళముందు కదలాడాయి. చెంపలమీద జారుతున్న కన్నీళ్ళు గుండెని తడిపేశాయి.

'ఏమండీ!' అంది హీనస్వరంతో!

'పరా! బాధపడుతున్నావా? తప్పు. మనం సంతోషించాలి. పోటు పడకుండా బైటపడినందుకు. పాపారావు మనపాలిటి దేవదూత. లేకపోతే సరిత బతుకు ఏమైపోయేది?' చాలా బాధగా అన్నాడు సోమేశం.

'అవునండీ! ముక్కూ మొహం తెలీకుండా ఎక్కడో వేలమైళ్ళ దూరంలో వున్న వాళ్ళ సంగతి విని, లేనిపోని ఆశలతో జీవితాలు పాడుచేసుకునే వాళ్ళు నాలాగా ఎందరున్నారో! వాళ్ళందరికీ ఇది కనువిప్పు. అందుకే అయిన వాళ్ళనడిగి అందరి సమక్షంలో అన్నీ తెలుసుకుని మన పెద్దవాళ్ళు పెళ్ళిళ్ళు చేసేవారు. అది ఛాదస్తంగా అనుకుని తీసిపారేస్తున్నారీ రోజుల్లో. నిమిషాల్లో పెళ్ళి, క్షణాలలో విడాకులు. అందుకనే నేటి యువతకి పెళ్ళంటే విరక్తి కలుగుతోంది. పెళ్ళి లేకుండా బతకలేమా అనే ప్రశ్న కూడా ఉద్భవిస్తోంది' అంది భర్త గుండెలపై వాలిపోతూ.

'అవును పరా!' అంటూ ఆమె తల నిమిరాడు సోమేశం. ఆ పిలుపు 'పరా' అని ఆమెకి కొండంత ఊరటనిచ్చింది. ఆ పిలుపులో ఆప్యాయతా, అభిమానం రంగరించిన అమృతంలా అనిపించింది. అలా ఎంతసేపు వుండిపోయిందో అతని కౌగిలిలో, గుండెలోని భారం తగ్గేవరకూ కన్నీరు తన మనసులోని మలినపు ఆలోచనలను కడిగి ప్రక్షాళనం చేసేంతవరకూ!

* * *